24న పిల్లలకు ఉచిత గుండె వైద్య శిబిరం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

పిల్లల గుండె సంబంధిత వ్యాధులకు సంబంధించి ఉచిత వైద్య శిబిరం ఈ నెల 24వ తేదీ మంగళవారం సాయంత్రం మెంటేవారితోటలోని సుందరయ్య భవనంలో నిర్వహిస్తున్నట్లు అల్లూరి సీతారామరాజు, భగత్‌సింగ్ సేవా విజ్ఞాన కేంద్రం కన్వీనర్ వి.రాధాకృష్ణ, వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడకు చెందిన ప్రత్యేక వైద్య నిపుణులు డాక్టర్ కె.విక్రమ్ పిల్లలను పరీక్షించి అవసరమైన వారికి పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. 15 సంవత్సరాల్లోపు వయసు గల చిన్నారులకు మెడికల్ క్యాంపులో ఉచిత పరీక్షలు, చికిత్సకు వైద్య సహాయం అందిస్తారని తెలిపారు. వైద్య శిబిరానికి వచ్చేవారు తమ పేరు నమోదు కోసం 62812 25145 కు ఫోన్ చేసి సంప్రదించవచ్చునని తెలిపారు.

'వంతులకు' రంగం సిద్ధం..!

- రబీ నాట్లు దాదాపు పూర్తి
- 1 నుంచి వంతులవారీ విధానానికి సన్నాహాలు
- నీటిఎద్దడి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు
- ఉమ్మడి జిల్లాకు 4,600 క్యూసెక్కుల నీరు విడుదల
- సీలేరు జలాలే ఆధారంగా ముందుకు
- జీతాలు అందక లస్కర్లలో తీవ్ర అసంతృప్తి

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రబీ సాగుకు సంబంధించి వంతులవారీ విధానంలో సాగునీటి సరఫరాకు అధికారులు సమాయత్తమవుతున్నారు. రబీనాట్లు దాదాపు పూర్తవడంతో ఇక నుంచి వంతులుగా సాగునీరు సరఫరా చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి వంతుల విధానం అమలు చేయనున్నట్లు సమాచారం. వంతులవారీ విధానంలో ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలనే చర్యలకు సంబంధించి ఇరిగేషన్ అధికారులు ఇప్పటి నుంచే తీవ్ర కసరత్తు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రబీలో 4.60 లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేపట్టారు. 11 ప్రధాన కాలువలు, 400కుపైగా పిల్ల కాలువల ద్వారా డెల్టాలో సాగునీటి సరఫరా జరుగుతోంది. గోదావరిలో నీటి ప్రవాహం తగ్గుముఖం పట్టింది. సీలేరులో జలవిద్యుత్ ఉత్పత్తి ద్వారా వచ్చే నీటిని సైతం ఇప్పటికే వినియోగిస్తున్నారు. ముందుముందు నీటి ఎద్దడి సమస్య మరింత పెరిగే అవకాశం ఉండటంతో సాగునీటి పంపిణీలో పలు చర్యలకు ఇరిగేషన్ అధికారులు ప్రణాళికలు రచిస్తున్నారు. సాగునీటి సమస్య రాకుండా ఉండాలంటే ఉమ్మడి జిల్లాకు రోజుకు ధవళేశ్వరం బ్యారేజీ నుంచి ఆరు వేల క్యూసెక్కుల నీరు విడుదల చేయాల్సి ఉంటుంది. నాట్లు సమయంలో సాగునీటి అవసరం ఎక్కువగా ఉంటుంది. దమ్ము చేసే సమయంలో పొలాల్లో నీరు ఎక్కువగా ఉండాలి. దీంతో రబీనాట్లును దృష్టిలో పెట్టుకుని మొన్నటి వరకూ రోజుకు ఆరు వేలు, 5,500 క్యూసెక్కుల సాగునీరు విడుదల చేశారు. నీటి ప్రవాహాలు తగ్గడంతో ప్రస్తుతం 4,600 క్యూసెక్కుల నీరు మాత్రమే విడుదలవుతోంది. దాదాపు రబీ నాట్లు పూర్తవ్వడంతో రైతులు మొదటి, రెండో విడత ఎరువులు చల్లడం వంటి నేపథ్యంలో సాగునీటి వాడకం తగ్గింది. దీంతో ప్రస్తుతం విడుదల చేస్తున్న నీరు సరిపోతుంది. ఎరువుల చల్లిక పూర్తయ్యి వరి పైరు దుబ్బు చేసే సమయంలో నీటి అవసరం ఎక్కువగా ఉంటుంది. దీంతో వంతులవారీ విధానం అమలు చేస్తే తప్ప ప్రస్తుతం సరఫరా చేస్తున్న సాగునీటితో ముందుకు సాగడం కష్టం. ఎండలు తీవ్రమయ్యే కొద్ది సాగునీటి సమస్య తీవ్రతరమయ్యే పరిస్థితి రానుంది. రానున్న సాగునీటి ఎద్దడిని దృష్టిలో పెట్టుకుని ఇప్పటి నుంచే జిల్లా ఇరిగేషన్ అధికారులు వంతులవారీ విధానానికి సన్నాహాలు చేస్తున్నారు. ప్రతియేటా జనవరి 20వ తేదీ తర్వాత వంతుల విధానం అమలవుతోంది. అయినప్పటికీ రైతులు సాగునీటి కష్టాలను ఎదుర్కొంటున్నారు. సాగునీటి కోసం రాత్రీ పగలు పడిగాపులు పడాల్సిన దుస్థితి వచ్చేది. ఈ ఏడాదైనా సాగునీటి సరఫరాలో తగు జాగ్రత్తలు తీసుకుని రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని అంతా కోరుతున్నారు. ఇరిగేషన్ అధికారులు ఏవిధంగా ముందుకు సాగుతారో వేచిచూడాలి.



ఇరిగేషన్ ఉద్యోగం సంఘం నాయకుడు శ్రీనివాస్‌ను కలిసిన లస్కర్లు

తీవ్ర అసంతృప్తిలో లస్కర్లు

రబీలో సాగునీటి పంపిణీలో కాలువలపై పని చేసే లస్కర్లదే కీలక పాత్ర. వంతులవారీ విధానం అమలైతే లస్కర్లు రాత్రీ పగలు పని చేయాల్సి ఉంటుంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 197 మంది లస్కర్లు కాలువలపై పని చేస్తున్నారు. వీరికి ఏడాదికి పది నెలల జీతం మాత్రమే ఇస్తారు. ఏప్రిల్, మే నెల జీతాలు ఇవ్వరు. అయితే పని మాత్రం చేయించుకుంటున్నారు. గడిచిన కొన్నేళ్లుగా ఏప్రిల్ 25వ తేదీ తర్వాతే కాలువల మూసివేత జరుగుతోంది. అప్పటి వరకూ లస్కర్లు పని చేయాలి. అంతేకాకుండా మే నెలలో క్లోజర్ పనులంటూ లస్కర్లను ఉపయోగించుకున్నా జీతాలు మాత్రం ఇవ్వడం లేదు. ఇచ్చే పది నెలల జీతాలైనా సక్రమంగా ఇస్తున్నారా అంటే అదీ లేదు. తొమ్మిది నెలలుగా లస్కర్లకు జీతాలు అందలేదు. ప్రతినెలా ఇచ్చే రూ.10,500 కూడా సకాలంలో ఇవ్వకపోవడంతో లస్కర్లు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జీతాలు ఇవ్వాలంటూ ఇటీవల నరసాపురం పర్యటనలో సిఎం జగన్‌ను కలిసినా ప్రయోజనం లేకుండాపోయింది. తమకు జీతాలు ఇప్పించాలని ఉమ్మడి జిల్లా ఉద్యోగ సంఘాల జెఎసి ఛైర్మన్, ఇరిగేషన్ ఉద్యోగ సంఘం నాయకుడు చోడగిరి శ్రీనివాస్‌ను లస్కర్లు ఆదివారం కలిసి తమగోడు వెళ్లబోసుకున్నారు. ఉన్నతాధికారులతో మాట్లాడి జీతాలు ఇప్పించాలని కోరారు. వంతుల వారీ విధానం అమలులో కీలక పాత్ర పోషించే లస్కర్లకు పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాల్సి ఉంది. ప్రభుత్వం, అధికారులు ఏవిధంగా స్పందిస్తారో వేచిచూడాలి.

26న మూడు ప్రాంతాల నుంచి ట్రాక్టర్ ర్యాలీలు

ఎపి రైతుసంఘాల సమన్వయ కమిటీ

ప్రజాశక్తి - వీరవాసరం

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ రైతుసంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 26న నిర్వహించనున్న ట్రాక్టర్ ర్యాలీలను జయప్రదం చేయాలని కమిటీ పిలుపునిచ్చింది. ఆదివారం రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు జుత్తిగ నరసింహమూర్తి అధ్యక్షతన ఉత్తరపాలెం బిసి కమ్యూనిటీ హాలులో నిర్వహించిన సమావేశంలో దీనికి అవసరమైన కార్యాచరణను రూపొందించారు. జిల్లాలో మూడు ప్రాంతాల నుండి ఈ ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పెనుమంట్ర నుండి భీమవరం వరకు, గణపవరం నుండి తాడేపల్లిగూడెం వరకు, మత్స్యపురి నుండి నరసాపురం వరకు పెద్దఎత్తున రైతులు ట్రాక్టర్ ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఆకుల హరేరాం మాట్లాడుతూ ఢిల్లీ రైతాంగ ఉద్యమం సందర్భంగా కేంద్రంలో మోడీ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రైతాంగాన్ని మోసగించిందన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం ఉత్పత్తి ఖర్చులకు ఆదనంగా యాభై శాతం కలిపి అన్ని పంటకు మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ మద్దతు ధర రైతులకు అందేలా మద్దతు ధరల గ్యారంటీ చట్టం వెంటనే తేవాలన్నారు. జిల్లాలో ధాన్యం కొనుగోలులో వస్తున్న సమస్యలను వెంటనే పరిష్కరించి రైతుల నుండి ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సమావేశంలో తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి తమ్మినీడి నాగేశ్వరరావు, బొంతు రామారావు, పాలా చక్రధర్‌రావు, కేతా పెద సత్యనారాయణ, కేతా జ్యోతిబసు, చెల్లబోయిన సీతారామయ్య, మైగాపుల రాంబాబు, కిలాడి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉత్తరపాలెంలో కరపత్రాలను విడుదల చేస్తున్న రైతు సంఘం సమన్వయ కమిటి

పెంటపాడు: రైతులకు మోడీ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని అఖిలపక్ష రైతుసంఘాల సమావేశం కోరింది. సమావేశం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. అఖిల భారత రైతు సంఘాల సమాఖ్య పిలుపు మేరకు ఈ నెల 26న పిప్పర నుండి తాడేపల్లిగూడెం వరకు ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించాలని సమావేశం నిర్ణయించింది. ర్యాలీలో గణపవరం, పెంటపాడు, తాడేపల్లిగూడెం రూరల్ మండలాల రైతులు తమ ట్రాక్టర్లు, మోటారు సైకిళ్లతో ర్యాలీలో పాల్గొనాలని సమావేశం కోరింది. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చింతకాయల బాబూరావు మాట్లాడుతూ మద్దతు ధరల గ్యారంటీ చట్టం వెంటనే తీసుకురావాలన్నారు. రైతు రుణ మాఫీ అమలు చేసి రైతులను ఆత్మహత్యల భారం నుంచి కాపాడాలని విజ్ఞప్తి చేశారు. తెలుగు రైతుసంఘం జిల్లా అధ్యక్షులు పాతూరి రాంప్రసాద్ చౌదరి మాట్లాడుతూ రైతు క్రాప్‌హాలిడే ప్రకటించాల్సిన పరిస్థితి రావడం బాధాకరమన్నారు. విద్యుత్ సంస్కరణల చట్టం రద్దు చేయాలని కోరారు. సిపిఐ మండల కార్యదర్శి కళింగ లక్ష్మణరావు, తెలుగురైతు నాయకులు కిలపర్తి వెంకట్రావు, సిపిఎం మండల కార్యదర్శి చిర్ల పుల్లారెడ్డి, సిఐటియు నాయకులు సిరపరపు రంగారావు, బంకురు నాగేశ్వరరావు పెనగంటి దుర్గారావు, కరక వెంకట్రావు, ఆడప ఆంజనేయులు, కొణతల నాగరాజు, మాదాసు శ్రీను పాల్గొన్నారు.

కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్షలు ప్రశాంతం

84 శాతం మంది అభ్యర్థులు హాజరు

తణుకు పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా ఎస్‌పి రవి ప్రకాష్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

పోలీస్ కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి ఆదివారం నిర్వహించిన ప్రిలిమినరీ రాత పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా ముగిశాయి. ఈ పరీక్షలకు 20,451 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా 17,255 మంది హాజరైనట్లు జిల్లా పోలీసు అధికారులు తెలిపారు. 84 శాతం హాజరు నమోదైంది. పరీక్షా కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా సజావుగా జరిగేలా ముందుగానే ఏర్పాట్లు చేశారు. జిల్లాలో భీమవరం 21, తాడేపల్లిగూడెం 14, తణుకు 4, వీరవాసరంలో ఒక కేంద్రంలో మొత్తం 40 కేంద్రాల్లో అభ్యర్థులు పరీక్షలు రాశారు. నిర్ణీత సమయానికి అభ్యర్థులంతా పరీక్షకు హాజరయ్యారు. పలు పరీక్షా కేంద్రాలను జిల్లా ఎస్‌పి రవిప్రకాష్ తనిఖీ చేశారు. సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ వాచీలు వంటివి తీసుకురాకుండా ముందుగానే తనిఖీలు చేశారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద మహిళా అభ్యర్థుల తనిఖీ నిమిత్తం తాత్కాలిక గదులను ఏర్పాటు చేశారు. నిబంధనల ప్రకారం తీసుకురావాల్సిన గుర్తింపు కార్డులను తీసుకురాని అభ్యర్థులను తిరిగి పంపించేశారు.

తాడేపల్లిగూడెం టౌన్: పట్టణ పరిసరాల్లో 14 పరీక్షా కేంద్రాల్లో కానిస్టేబుల్ రాత పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఈ పరీక్షా కేంద్రాలను డిఎస్‌పి శ్రీనాథ్ పర్యవేక్షించారు. హాల్‌టిక్కెట్‌తోపాటు ధ్రువీకరణపత్రం ఉంటేనే కేంద్రంలోకి అభ్యర్థులను అనుమతించారు.

తణుకు: పట్టణంలో ఆదివారం కానిస్టేబుల్ అర్హత పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఈ పరీక్షకు తణుకు పరిసర ప్రాంతాల నుంచి 1288 మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా 1055 మంది మాత్రమే పరీక్ష రాశారు. 233 మంది పరీక్షకు గైర్హాజరయ్యారని తణుకు సిఐ ఎం.సత్యనారాయణ తెలిపారు. పట్టణంలోని ఎస్‌కెఎస్‌డి మహిళా డిగ్రీ, జూనియర్ కళాశాల, ఎస్‌ఎంవిఎం పాలిటెక్నిక్ కళాశాల, శశి జూనియర్ కళాశాలలో అభ్యర్థులకు సెంటర్లను ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాల్లో పరీక్ష నిర్వహణా తీరును జిల్లా ఎస్‌పి రవిప్రకాష్ పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆయన వెంట సిఐ సత్యనారాయణ, సిబ్బంది ఉన్నారు.

వీరవాసరం: వీరవాసరం డిగ్రీ కళాశాల కేంద్రంగా ఆదివారం నిర్వహించిన పోలీసు కానిస్టేబుల్ అర్హత పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. పరీక్షా కేంద్రాన్ని నరసాపురం డిఎస్‌పి మనోహరాచారి పరిశీలించారు. ఈ కేంద్రంలో మొత్తం 240 మంది అభ్యర్థులకుగాను 209 మంది అభ్యర్థులు హాజరైనట్టు ఎస్‌ఐ రమేష్ తెలిపారు. వీరిలో 182 మంది పురుషులు, 27 మంది మహిళలు ఉన్నారన్నారు.

వీరవాసరంలో పరీక్షకు వచ్చిన అభ్యర్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు

భీమవరంలో పరీక్షకు హాజరైన అభ్యర్థులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు

నూతన విద్యా విధానం, సిపిఎస్‌ను రద్దు చేయాలి

యుటిఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశం డిమాండ్

ప్రజాశక్తి - పాలకొల్లు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిపాదించిన నూతన విద్యా విధానంతోపాటు సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని పిడిఎఫ్ ఎంఎల్‌సిలు ఇళ్ల వెంకటేశ్వరరావు, షేక్ సాబ్జీ డిమాండ్ చేశారు. స్థానిక అంబేద్కర్ భవనంలో ఆదివారం యుటిఎఫ్ 47వ జిల్లా కౌన్సిల్ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథులుగా విచ్చేసిన వెంకటేశ్వరరావు, సాబ్జీ మాట్లాడుతూ సిపిఎస్ రద్దు చేసే వరకూ దీర్ఘకాలిక పోరాటం చేస్తామని హెచ్చరించారు. పెండింగులో ఉన్న ప్రమోషన్లు, బదిలీలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సర్దుబాటులో 60, 70 కిలోమీటర్లు బదిలీ చేయడాన్ని వ్యతిరేకించారు. వెంటనే ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం తొమ్మిది డిఎలు బకాయి పెట్టిందని, వెంటనే డిఎలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్.ప్రసాద్, రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి, నేత ఎన్‌వి.మనోహర్‌రావు మాట్లాడారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు, ప్రధాన కార్యదర్శి ఎకెవి.రామభద్రం, కోశాధికారి సిహెచ్.పట్టాభిరామయ్య, జిల్లా సహాధ్యక్షులు కె.రాజశేఖర్, నేతలు ఎం.ఇజ్రాయిల్‌రాజు, ఎం.రామకృష్ణ, నాగ శిరోమణి, శ్రీదేవి, శ్రీరామకృష్ణ ప్రసాద్, జి.లక్ష్మీనారాయణ, కెవి.సత్యనారాయణమూర్తి, పోలిశెట్టి క్రాంతికుమార్, సీతారామరాజు పాల్గొన్నారు. సీనియర్ నేతలు జయప్రభ, వలవల శ్రీరామ్మూర్తి తొలుత పతాకావిష్కరణలు చేశారు. అలాగే ఎంఎల్‌సి సాబ్జీ, యుటిఎఫ్ నేతలు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న ఎంఎల్‌సి సాబ్జీ, యుటిఎఫ్ నేత గోపీమూర్తి

నేడు నరసాపురంలో జిల్లాస్థాయి స్పందన

ప్రజాశక్తి - భీమవరం

ఈ నెల 23న జిల్లాస్థాయి 'స్పందన' కార్యక్రమం నరసాపురంలోని మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి జరిగే ఈ కార్యక్రమంలో ప్రజలు తమ వినతులు అందజేయవచ్చునని పేర్కొన్నారు. అలాగే జిల్లాలోని అన్ని డివిజనల్, మండల, మున్సిపల్ కార్యాలయాల్లో 'స్పందన' కార్యక్రమం యధావిధిగా నిర్వహిస్తారని తెలిపారు. జిల్లా అధికారులందరూ ఉదయం పది గంటలకు నరసాపురం మున్సిపల్ కార్యాలయంలో విధిగా హాజరుకావాలని కోరారు.

లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లు అందజేయాలి

సిపిఎం పట్టణ కార్యదర్శి వాసుదేవరావు

ప్రజాశక్తి - భీమవరం

లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లు ఇస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని, ఏళ్లు గడుస్తున్నా ఇంతవరకూ హామీ నెరవేర్చలేదని తక్షణం లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లు అందజేయాలని సిపిఎం పట్టణ కార్యదర్శి బి.వాసుదేవరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జగన్ ప్రభుత్వం అధికారం చేపట్టి మూడున్నర ఏళ్లు దాటినా ఇంతవరకూ లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లు పూర్తిస్థాయిలో కేటాయించకపోవడం దారుణం అన్నారు. బ్యాంకు అధికారులు లోను కట్టాలని ఒత్తిడి చేస్తున్నారని, ఇల్లు ఇవ్వకుండా లోన్ ఎలా కడతారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. లక్షల రూపాయలు డిపాజిట్లు కట్టించి సంవత్సరాలు గడుస్తున్నా తెచ్చిన డబ్బులకు వడ్డీ కట్టలేక మరోపక్క ఇంటి అద్దెలు చెల్లించలేక వారు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులందరికీ తక్షణం ఇళ్లు మంజూరు చేయాలని, మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో దశలవారీగా ఆందోళన చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

చిరస్మరణీయులు.. ఆచార్య కెవి

నేడు విశాఖపట్నంలో సంస్మరణ సభ



ఆచార్య కెవిగా ప్రసిద్ధి చెందిన కాట్రగడ్డ వెంకటేశ్వర్లు ఆంధ్ర విశ్వవిద్యాలయం రాజనీతి శాస్త్ర విభాగంలో తనదైన శైలిలో బోధన చేస్తూ విద్యార్థులను ప్రభావితం చేశారు. 1983-85 మధ్యకాలంలో నేను విద్యార్థిగా ఉన్నప్పుడు మాకు 'పబ్లిక్‌పాలసీ అనాలిసిస్' అనే పాఠ్యాంశం కెవి బోధించేవారు. ఏ ప్రభుత్వ విధానమైనా ప్రజలకు ప్రయోజనం కలిగేలా ఉండాలని, ఏ ప్రభుత్వమైనా ప్రజాశ్రేయస్సు ప్రాతిపదికగా విధానాలు రూపొందించాలి అనేవారు. విధాన నిర్ణయాల అమలులో చిత్తశుద్ధి ఉండాలని, అప్పుడే లక్ష్యాలను చేరుకోగలమని, ఏ విధానాలను.. ఎలా తీసుకోవాలి.. ఎలా అమలు చేయాలి అనే దానిని తర్కబద్ధంగా చెప్పేవారు. ఆయన భారతదేశంలోని బ్రిటీష్ పూర్వ గ్రామీణ వ్యవస్థపై పరిశోధనలు చేశారు. ఆనాటి స్వయంప్రతిపత్తి గ్రామాలను తర్వాత కాలంలో బ్రిటీష్ ప్రభుత్వం తమ రాబడి కోసం ఏ విధంగా విచ్ఛిన్నం చేసిందో తరగతుల్లో వివరించేవారు. ఆచార్య కెవి క్రమశిక్షణకు మారుపేరు. సమయపాలన పాటించేవారు. వామపక్షభావాలను పూర్తిగా అధ్యయనం చేసి ఆచరణలో చూపించిన మహనీయులు కెవి.

'మహాభారతంలో రాజనీతి' అనే అంశంపై పరిశోధన చేశారు. ప్రముఖ చరిత్రకారుడు డి.డి.కోశాంబితో సన్నిహితంగా ఉండేవారు. ప్రముఖ ఆచార్యులు పి.కృష్ణప్రసాద్, ఎంఎల్‌సి కెఎస్.లక్ష్మణరావు, కీర్తిశేషులు ఆచార్య ఎంఎస్ఎస్.కోటేశ్వరరావు, వై.వెంకటేశ్వరరావు (వైవి), ఎస్‌టి కార్పొరేషన్ ఛైర్మన్ కుంచా రవిబాబు తదితరులు కెవి విద్యార్థులే. బివి.రాఘవులు, నరసింగరావు (వైజాగ్) తదితరులతో సన్నిహిత సంబంధాలు ఉండేవి.

'నక్సల్‌బరీ మూవ్‌మెంట్ ఏన్ ఐడియాలాజికల్ సర్వే' అనే అంశంపై ఆర్.కుప్పానాయుడుచే పరిశోధన చేయించారు. ఇది ఆంధ్రప్రదేశ్‌లో నక్సలైట్ ఉద్యమంపై జరిగిన తొలి పరిశోధనా అంశం. ప్రగతిశీల భావాలతో వామపక్ష వాదిగా ఉండే అనేకమంది విద్యార్థి నాయకులకు, విద్యార్థులకు ఆంధ్రా యూనివర్సిటీలో భారత రాజకీయాల పట్ల ఆసక్తి పెంచడానికి, అవగాహన పెంచడానికి స్టడీసర్కిల్ ఏర్పాటు, నిర్వహణను ప్రోత్సహించారు. ఆయన రాసిన 'డెమోక్రసీ ఎట్ వర్క్' అనే పుస్తకంతోపాటు పలు పుస్తకాలు రచించారు. తెలుగు అకాడమీ ప్రచురించిన అనేక పుస్తకాలకు సంపాదకుడిగా వ్యవహరించారు. గత సెప్టెంబరులో నేను రాజమండ్రిలో వారి కుమారుడు శ్రీనివాస్ ఇంట్లో ఆచార్య కెవిని కలిసినప్పుడు చాలా ఆప్యాయంగా మాట్లాడుతూ వామపక్ష భావాల విస్తృతి కోసం డాక్టర్ స్టాలిన్, డివిఎస్.వర్మ చేసే ప్రయత్నాలను ఎంతగానో ప్రశంసించారు. ఆచార్య కెవి ఈ నెల పదో తేదీన రాజమండ్రిలో చిన్నకుమారుని ఇంటి వద్ద తుదిశ్వాస విడిచారు. ఎంతోమంది విద్యార్థుల అభిమానాన్ని, మేధావుల ప్రశంసలు అందుకున్న ఆచార్య కెవి సదా చిరస్మరణీయులు.

- డాక్టర్ బివివి.బాలకృష్ణ
రిటైర్డ్ ప్రొఫెసర్, రాజనీతిశాస్త్ర విభాగం
ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం
రాజమహేంద్రవరం

తాగునీటి సమస్యను పరిష్కరిస్తాం : పివిఎల్

ప్రజాశక్తి - ఉండి

గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు అన్నారు. ఆదివారం ఉండి కాపులపేటలో 60,000 లీటర్ల సామర్థ్యం కలిగిన ఓవర్ హెడ్ ట్యాంక్‌ను నిర్మాణ పనులకు పివిఎల్ ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే వేసవిని దృష్టిలో పెట్టుకుని గ్రామంలో నీటి కొరత తీర్చాలనే ఉద్దేశంతో జలజీవన్ మిషన్‌లో గ్రామానికి కేటాయించిన సుమారు 38 లక్షల రూపాయలను ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణానికి వినియోగిస్తున్నట్లు తెలిపారు. ఈ ట్యాంకు నిర్మాణం ద్వారా గ్రామంలో పూర్తిగా నీటి కొరత తీరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి కమతం సౌజన్య బెనర్జీ, ఉప సర్పంచి గొట్టుముక్కల కళ్యాణ వర్మ, ఎంపిపి ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు, జెడ్‌పిటిసి ఆర్.కనకదుర్గ మహంకాళి, ఎంపిటిసి గిరడా రమణ శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

ట్యాంకు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న పివిఎల్ నరసింహరాజు

వాటర్ ట్యాంకు ద్వారా నీటిని సరఫరా చేస్తున్న పంచాయతీ అధికారులు

వాటర్ ట్యాంకుల ద్వారా నీరు సరఫరా

ప్రజాశక్తి - పెనుమంట్ర

నత్తారామేశ్వరం పరిధిలోని పంచనవారిపాలెంలో వాటర్ టాంకు మోటార్ మరమ్మతుల కారణంగా ప్రజలకు వాటర్ ట్యాంకుల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నామని పంచాయతీ కార్యదర్శి శ్రీదేవి నాగేంద్ర కుమార్ అన్నారు. ఆదివారం సర్పంచి గలగల ధర్మారెడ్డి ఆధ్వర్యంలో పంచనవారిపాలెంలో అత్తిలి నుంచి వాటర్ ట్యాంకు తెప్పించి నీటిని సప్లై చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మోటారుకు మరమ్మతులు చేపట్టే వరకూ నీటిని సరఫరా చేస్తామని తెలిపారు. పంచన వారిపాలెంలో 350 జనాభా నివసిస్తున్నారని తెలిపారు. వారికి రెండు పూటలా రెండు టాంకులతో నీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు.

జుత్తిగ రోడ్డుకు నిధులు మంజూరు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఈ నెల 21వ తేదీన అధ్వానంగా పెనుమంట్ర - జుత్తిగ రోడ్డు శీర్షికన ప్రజాశక్తి పత్రికలో ప్రచురితమైన కథనానికి ఆర్అండ్బి, పంచాయతీరాజ్ అధికారులు ఆదివారం స్పందించారు. జుత్తిగ రోడ్డుకు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. త్వరలో రూ.26 లక్షలతో రోడ్డు వేయనున్నట్లు పంచాయతీరాజ్ ఎఇ సత్తి నాగిరెడ్డి తెలిపారు. అలాగే నెలమూరు లింకు రోడ్డు రెండు నెలల్లో వేయనున్నట్లు ఆర్అండ్బి ఎఇ విఆర్పి యశ్వంత్ అన్నారు.

ఎంఎల్ఎ రామరాజుకు శివ పరామర్శ

ప్రజాశక్తి - కాళ్ల



హైదరాబాద్లోని ఆసుపత్రిలో ఎంఎల్ఎ రామరాజును పరామర్శిస్తున్న శివరామరాజు

ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు హైదరాబాద్లో ఓ ప్రయివేటు ఆస్పత్రిలో శుక్రవారం శస్త్రచికిత్స చేయించుకున్నారు. ఈ క్రమంలో మాజీ ఎంఎల్ఎ శివరామరాజు ఆదివారం హైదరాబాద్ ఆస్పత్రిలో రామరాజును పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

ఉండి: ఇటీవల అనారోగ్యం బారిన పడి హైదరాబాద్లోని ప్రయివేట్ ఆసుపత్రిలో శస్త్ర చికిత్స చేయించుకున్న ఎంఎల్ఎ మంతెన రామరాజు వేగంగా కోలుకోవాలని టిడిపి నాయకులు ఆలయాల్లో పూజలు, చర్చిల్లో ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు చెన్నంశెట్టి హరి నాయుడు మాట్లాడారు.

యండగండిలో అన్న సమారాధన

ప్రజాశక్తి - ఉండి

యండగండి గ్రామ దేవత పోలేరమ్మ నూతన ఆలయం ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ఆలయంలో ఆచంట శాసనసభ్యులు చెరుకువాడ శ్రీ రంగనాథరాజు చేతుల మీదుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యండగండి గ్రామ ప్రజల ఆదరాభిమానాలు ఎనలేనివన్నారు. యండగండి తన స్వగ్రామం కావడంతో తన సొంత నిధులు వెచ్చించి గ్రామంలో శిథిలావస్థకు చేరిన పోలేరమ్మ ఆలయాన్ని పునర్నిర్మించామని, ఆలయం వెలుపల కళ్యాణ మండపాన్ని నిర్మించినట్లు ఆయన తెలిపారు. గతంలో తాను గ్రామంలోనే నాలుగు కోట్ల రూపాయలతో శివాలయాన్ని కూడా పునర్నిర్మించినట్లు తెలిపారు. అనంతరం గ్రామస్తులు చెరుకువాడ శ్రీరంగనాథరాజు దంపతులను సన్మానించారు. అలాగే సుమారు పదివేల మంది యాత్రికులకు అన్న సమారాధన నిర్వహించారు.

స్టడీ మెటీరియల్పై వైసిపి రంగులు చూపుతున్న టిడిపి నేతలు

'స్టడీ మెటీరియల్పై వైసిపి రంగులు సరికాదు'

నరసాపురం : పదో తరగతి విద్యార్థుల కోసం ముద్రించిన స్టడీ మెటీరియల్ పుస్తకం ఒక చిత్రంపై వైసిపి రంగులు ముద్రించడం సరికాదని టిడిపి ఇన్ఛార్జి పొత్తూరు రామరాజు తెలిపారు. టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు తాడివాడ రమేష్ బాబు అధ్యక్షతన టిడిపి కార్యాలయం వద్ద జరిగిన విలేకరుల సమావేశంలో ఇన్ఛార్జి రామరాజు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పదో తరగతి విద్యార్థుల కోసం ముద్రించిన స్టడీ మెటీరియల్ పుస్తకం ఒక చిత్రంపై వైసిపి రంగులు, సిఎం జగన్ చిత్రాలు పుస్తక వెనుక భాగంలో ప్రభుత్వ పథకాల వివరాలతో ముద్రించడం సరికాదన్నారు. గతంలో సచివాలయాలకు, టిడ్కో ఇళ్లకు రంగులు వేసినప్పుడు కోర్టు మొట్టికాయలు వేసిందన్నారు. ఈ పరిపాలనకు చరమగీతం పాడే రోజులు దగ్గర పడ్డాయన్నారు. ఈ రంగును తొలగించకపోతే టిఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు జక్కం శ్రీమన్నారాయణ, టిఎన్ఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి పాల శివ ప్రసాద్, జిల్లా అధ్యక్షులు తిరుమాని హేమంత్ వర్మ, కొప్పాడ రవి పాల్గొన్నారు.

'వైసిపి హయాంలో మహిళలపై పెరిగిన దాడులు'

ప్రజాశక్తి - తణుకు

వైసిపి ప్రభుత్వం అధికారంలో వచ్చినప్పటి నుంచి మహిళలపై దాడులు, అఘాయిత్యాలు ఎక్కువయ్యాయని తెలుగు మహిళా విభాగం రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి మానం విజేత అన్నారు. ఆదివారం స్థానిక టిడిపి కార్యాలయంలో నియోజవర్గ స్థాయి మహిళా జాగృతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసిపి మంత్రులు, శాసనసభ్యులు, కార్యకర్తలు మహిళల హక్కులను కాలరాసే సంఘటనలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ప్రశ్నించే వారిపై వైసిపి సోషల్ మీడియాను ఉసుగొల్పి మహిళలపై అసభ్యకరమైన పోస్టులు పెట్టి వేధిస్తోందని తెలిపారు. చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటారని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదులు చేస్తే బాధితులపై నాన్ బెల్ కేసులు నమోదు చేసి తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని చెప్పారు. ఇటువంటి అరాచక పరిపాలన తరిమికొట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణప్రియ, టిడిపి రాష్ట్ర కార్యదర్శి తమరాపు రమణమ్మ, కె.ఇందిరా దేవి, తణుకు రేవతి, దూరం చిట్టిబాబా, చాక్లెట్ సత్యవాణి, వీరవల్లి లక్ష్మి, గుండు రమాదేవి పాల్గొన్నారు.

బీచ్ వద్ద పర్యాటకుల సందడి

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెం బీచ్ వద్ద ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. సుదూర ప్రాంతాల నుంచి పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు ప్రత్యేక ద్విచక్ర వాహనాల్లో బీచ్కు ఉదయమే చేరుకున్నారు. పలువురు సముద్ర కెరటాల్లో స్నానం చేశారు. చిన్నారులు ఒడ్డుకు కొట్టుకొస్తున్న కెరటాలతో, ఇసుక తిన్నెలపై ఆటలాడుకున్నారు. అనంతరం ఒడ్డున ఉన్న ఆలయాలను దర్శించుకుని సరివే, కొబ్బరి తోటల్లో సహపంక్తి భోజనాలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆహ్లాదంగా గడిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

ట్యాంకు చుట్టూ పిచ్చి మొక్కలు!

పైప్లైన్ల లీకేజీ ... పట్టించుకోని అధికారులు

రాజుగూడెం వాటర్ ట్యాంక్ చుట్టూ పిచ్చి మొక్కలు

ప్రజాశక్తి - పెనుగొండ

మేజర్ పంచాయతీ అయిన పెనుగొండలోని రాజుగూడెంలో వాటర్ వద్ద అపారిశుధ్యం నెలకొంది. ట్యాంకు చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగిపోయి చిట్టడవిని తలపిస్తోంది. దీనికితోడు చెత్తాచెదారం పేరుకుపోవడం, పందులు స్వైరవిహారం చేయడంతో ఆ ప్రాంతంలో దుర్వాసన వెదజల్లుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్యాంకు చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగిపోయి అధ్వానంగా తయారైనా అధికారులు గానీ, ప్రజా ప్రతినిధులు గానీ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

ట్యాంకు శుభ్రత ఏదీ..!

వాటర్ ట్యాంకును శుభ్రం చేయడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు ఎక్కడబడితే అక్కడ పైప్లైన్లు లీకవుతున్నాయని, అధికారులు మరమ్మతులు చేయడం లేదని వాపోతున్నారు. వాటర్ ట్యాంకును శుభ్రం చేయకుండా ఆ నీటినే సరఫరా చేస్తున్నారని, దీంతో తాము అనారోగ్యాల బారిన పడుతున్నామని రాజుగూడెం, దక్షిణపేట, ఇందిరా శాంతినగర్, ఎన్టిఆర్ కాలనీ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ నీరు తాగలేక వాటర్ టిన్నులు కొనుగోలు చేసుకుని తాగుతున్నామని చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ట్యాంకును శుభ్రం చేయించాలని, అలాగే ట్యాంకు చుట్టూ పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించాలని కోరుతున్నారు.

పైప్లైన్ పాడవ్వడంతో లీకవుతున్న నీరు

పెనుమంచిలిలో నిర్వహిస్తున్న ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమం

జిఒ నెం.1 జారీ దారుణం

టిడిపి నేత బాలాజీ

ప్రజాశక్తి - ఆచంట

రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు పర్యటనకు వస్తున్న విశేష ఆదరణ చూసి ఓర్వలేక ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డి రాజ్యాంగ హక్కులను కాలరాస్తూ జిఒ 1ని జారీ చేయడం దారుణమని టిడిపి నాయకులు సిర్రా బాలాజీ విమర్శించారు. టిడిపి పెనుమంచిలి గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఓటర్ వెరిఫికేషన్, ఇదేం కర్మ రాష్ట్రానికి అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. ప్రత్యేకంగా రూపొందించిన కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. అనంతరం బాలాజీ మాట్లాడుతూ ఈ నెల 27వ తేదీ నుంచి లోకేష్ పాదయాత్రను అడ్డుకోవాలని జిఒను తీసుకొచ్చారని విమర్శించారు. వైసిపి ప్రభుత్వం అలంబిస్తున్న విధానాలతో రాష్ట్ర ప్రజానీకం అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పిచ్చెట్టి శివ, పంది సుబ్బారావు, ఆకుమర్తి మోహన్రావు, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

'బిసిల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యం సరికాదు'

ప్రజాశక్తి - పాలకొల్లు

స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు గడిచినా దేశంలో బిసిల ఆర్థిక, సామాజిక, రాజకీయ పరిస్థితుల్లో ఎటువంటి అభివృద్ధి లేదని, దేశంలో బిసి జనాభా లెక్కలు లేకపోవడం వల్ల వారికి ఫలాలు దక్కకుండా పోతున్నాయని పలువురు బిసి నేతలు తెలిపారు. పాలకొల్లు లయన్స్ కమ్యూనిటీ హాల్లో వివిధ బిసి సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశానికి చైతన్య వేదిక అధ్యక్షులు వీరవల్లి శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పలువురు బిసి నేతలు మాట్లాడారు. దేశంలో 54 శాతంగా ఉన్న బిసిల జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్ కల్పించడంలో పాలకులు అశ్రద్ధ వహిస్తున్నారన్నారు. రానున్న రోజుల్లో దేశ వ్యాప్తంగా సమగ్ర కులగణన అంశంపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలన్నారు. ఈ నెల 25న విజయవాడలో ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి రౌండ్ టేబుల్ సమావేశానికి రాష్ట్రంలోని బిసి నేతలు హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్, ఎంఎల్సి అంగర రామ్మోహన్, మాజీ ఎంఎల్సి మేకా శేషుబాబు మాట్లాడారు. బొక్కా రామాకాంత్, వెంకటేష్ వడయార్, కొప్పర్తి మురళీ కృష్ణ, చినమిల్లి గణపతి పాల్గొన్నారు.

'ఛాంబర్స్'లో మెరిట్ స్కాలర్షిప్ టెస్ట్

ప్రజాశక్తి - పాలకొల్లు

మెరిట్ టెస్ట్కు హాజరైన విద్యార్థులు

పట్టణంలోని ఛాంబర్స్ జూనియర్ కళాశాలలో 10వ తరగతి విద్యార్థులకు మెరిట్ స్కాలర్షిప్ టెస్ట్ ఆదివారం నిర్వహించారు. ఈ పరీక్షకు పాలకొల్లు పరిసర ప్రాంతాల నుండి 1,629 మంది విద్యార్థులు హాజరయ్యారు. జెడ్పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్ ప్రశ్నా పత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ మెరిట్ టెస్ట్ విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు తక్కువ ఫీజులతో ఉత్తమ విద్యను లాభాపేక్ష లేకుండా ఛాంబర్స్ కళాశాల అందిస్తోందన్నారు. ఛాంబర్ ఛైర్మన్ కారుమూరి నరసింహారావు మాట్లాడుతూ 1974లో ప్రారంభించి వచ్చే విద్యా సంవత్సరంలో గోల్డెన్ జూబ్లీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కళాశాల సెక్రటరీ కలిదిండి రామరాజు మాట్లాడుతూ పదిలో 90 శాతం మార్కులు సాధించిన విద్యార్థులకు పూర్తి ఫీజు రాయితీ, 85 శాతం మార్కులు సాధించిన సాధించిన వారికి 50 శాతం ఫీజు రాయితీ కల్పిస్తున్నట్లు తెలిపారు. మెరిట్ స్కాలర్ షిప్ మొదటి, ద్వితీయ, తృతీయ కన్సలేషన్ ప్రైజస్ సుమారు 2,50,000 బహుమతులు ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఒల్గా డిగ్రీ అండ్ పీజీ కళాశాల ప్రిన్సిపల్ డి. వెంకటేశ్వరరావు, అకడమిక్ అడ్వయిజర్స్ ఎబిఎస్ మూర్తి, ఎస్.సీతారామారావు, ట్రెజరర్ జల్లూరి రామలింగేశ్వరరావు, ఇనుకొండ రంగారావు, అడబాల రమణ, మాటూరి నారాయణమూర్తి పాల్గొన్నారు.

ఎస్సి, ఎస్టి సబ్ప్లాన్ను శాశ్వతంగా అమలు చేయాలి

ప్రజాశక్తి - ఆచంట

ఎస్సి, ఎస్టి సబ్ప్లాన్ చట్టాన్ని శాశ్వతంగా అమలు చేయాలని టిడిపి ఎస్సి సెల్ ఆచంట నియోజకవర్గ అధ్యక్షులు బీరా నరసింహమూర్తి అన్నారు. టిడిపి ఎస్సి సెల్ నియోజకవర్గ కమిటీ సమావేశం బీరా నరసింహమూర్తి అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత గిరిజనుల ఆర్థిక ప్రగతి కోసం దళితవాడల అభివృద్ధిని కాంక్షిస్తూ ఉమ్మడి రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఉద్యమించిన ఫలితంగా అప్పటి ప్రభుత్వం ఎస్సి ఎస్టి సబ్ప్లాన్ చట్టం 2013ను పదేళ్ల కాల పరిమితితో తీసుకొచ్చిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం సబ్ ప్లాన్ కు సరిపడా నిధులు కేటాయించకుండా, కేటాయించిన నిధులను నవరత్న పథకాలకు మళ్లిస్తోందని విమర్శించారు. దళితవాడలు నేటికీ అనేక సమస్యలతో కొట్టుమిట్టులాడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సబ్ప్లాన్ నిధులు ఎంతవరకూ ఉపయోగపడ్డాయో, దళితుల అభివృద్ధిపై సమగ్ర విచారణ జరిపి ప్రభుత్వం శ్వేత పత్రాన్ని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. టిడిపి ఎస్సి సెల్ కమిటీ ఆధ్వర్యంలో త్వరలోనే అన్ని దళిత సంఘాలు, ప్రజాసంఘాలను కలుపుకొని నియోజకవర్గంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించేందుకు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఎస్సి, ఎస్టి సబ్ప్లాన్ ద్వారా ప్రభుత్వం ఇంతవరకు కనీసం ఒక్క సీసీ రోడ్డు కూడా నిర్మించలేదన్నారు. ఆ నిధులను దళితవాడల్లో ఖర్చు చేసినట్లు నిరూపిస్తే శిరోముండనం చేసుకుంటానని దళిత నాయకులు నక్కా వేద వ్యాస శాస్త్రి సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి, పెనుగొండ సర్పంచి నక్కా సోనీ శ్యామల, సిర్రా బాలాజీ, ఆకుమర్తి మోహన్రావు, వెన్నపు వెంకటేశ్వరరావు, రొక్కాల సురేష్ పాల్గొన్నారు.

మమ్మీకి ఎంఎల్ఎ నిమ్మల శుభాకాంక్షలు

ప్రజాశక్తి - పాలకొల్లు

డిప్యూటీ కలెక్టర్గా ప్రమోషన్ పొందిన తహశీల్దార్ మమ్మీని అభినందించిన ఎంఎల్ఎ నిమ్మల

పాలకొల్లు తహశీల్దార్గా 2019లో ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన జి.మమ్మీ డిప్యూటీ కలెక్టర్గా ప్రమోషన్ పొందడం సంతోషకమని ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు తెలిపారు. ఆమెకు స్వయంగా ఎంఎల్ఎ ఆదివారం శుభాకాంక్షలు తెలిపారు. ఆమె పనిచేసిన 4 సంవత్సరాల్లో వివాదాలు లేకుండా పేదలు, బడుగు బలహీన వర్గాల సమస్యలపై వెంటనే స్పందించి పరిష్కరించారని తెలిపారు. నిజాయితీ, నిబద్ధతతో విధులు నిర్వర్తించిన మమ్మీకి ఉన్నత స్థానం రావడం అభినందనీయమన్నారు.

రామలింగేశ్వర స్వామి నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం

ప్రజాశక్తి - పాలకొల్లు

పట్టణంలో క్షీరా రామలింగేశ్వర స్వామి దేవస్థానం అన్నదాన ట్రస్ట్కు స్థానికులు పట్నాల రామారావు, అనసూయ దంపతులు రూ.10.000 విరాళం ఆదివారం అందజేశారు. వారిని ఆలయ ఛైర్మన్ కోరాడ శ్రీనివాసరావు, ఇఒ యాళ్ల సూర్యనారాయణ సూపరింటెండెంట్ నరసింహస్వామి శేష వస్త్రంతో సత్కరించి, స్వామివారి జ్ఞాపికను అందజేశారు.

దాతల సహకారంతో ఆర్ఒ ప్లాంట్ ఏర్పాటు

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరులోని రామాలయ ఆవరణలో దాతలు ఆర్ఒ ప్లాంట్ను ఏర్పాటు చేశారు. ఆర్యవైశ్య సంఘానికి చెందిన అనంతపల్లి ఫణి పుట్టినరోజును పురస్కరించుకుని వారి కుమార్తెలు లక్ష్మీ హరిప్రియ, విష్ణుప్రియ సుమారు రూ.నాలుగు లక్షల వెచ్చించి ప్రజలకు శుద్ధి జలాలు అందించేందుకు ఆర్ఒ ప్లాంట్ ఏర్పాటు చేశారు. దీన్ని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాద్ రాజు చేతుల మీదగా సోమవారం ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

రామాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన ఆర్ఒ ప్లాంట్

క్షతగాత్రురాలు మృతి

ప్రజాశక్తి - పాలకోడేరు

వంట చేస్తుండగా చీరకు నిప్పంటుకొని గాయాల పాలైన మహిళ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. ఈ సంఘటనకు సంబంధించి పాలకోడేరు ఎస్ఐ రామచంద్రరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వేంద్ర గ్రామానికి చెందిన నక్క లక్ష్మి (36) గత నెల 21న ఇంట్లో వంట చేస్తుండగా చీరకు నిప్పంటుకుని తీవ్రగాయాల పాలైంది. ఆమెను భీమవరం ప్రభుత్వాసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. పరిస్థితి విషమించడంతో ఆదివారం ఆమె మృతి చెందింది. ఈ సంఘటనపై లక్ష్మి కోడలు ఏసమ్మ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

నేరాలు - ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి

ప్రజాశక్తి - పాలకోడేరు

ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి చెందిన సంఘటన శృంగవృక్షంలో ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పెనుమంట్ర మండలం పోలమూరు గ్రామానికి చెందిన కండవల్లి సురేష్ (39) తన సొంత ఆటోలో కూరగాయల కిరాయి నిమిత్తం పోలమూరు నుంచి ఆటోలో బయలుదేరి భీమవరం వెళ్లారు. ఈ నేపథ్యంలో శృంగవృక్షం కనకదుర్గమ్మ అమ్మవారి గుడి సమీపాన ఉన్న రైస్ మిల్లు వద్ద భీమవరం వైపు నుంచి వస్తున్న లారీ ఎదురుగా వచ్చి ఆటోను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటో నుజ్జునుజ్జు అవ్వడమే గాక ఆటో డ్రైవర్ సురేష్కు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో సురేష్ను చికిత్స నిమిత్తం భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ పరిస్థితి విషమించి మృతి చెందాడు. తెల్లవారుజామున దట్టంటా మంచు కమ్ముకోవడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రమాదం జరిగిన సమయంలో ఆటో డ్రైవర్ సురేష్ మినహా ఎవరూ లేరు. ఆటోలు ప్రణకులు ఉండి ఉంటే బారి ప్రాణ నష్టం సంభవించేదని స్థానికులు చెబుతున్నారు. ఘటనా స్థలాన్ని ఎస్ఐ సిహెచ్.రామచంద్రరావు పరిశీలించి వివరాలు సేకరించారు. మృతుడు సురేష్ భార్య విద్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామచంద్రరావు తెలిపారు.

ముత్యాలమ్మ ఆలయం కిటకిట

ప్రజాశక్తి - మొగల్తూరు

ముత్యాలపల్లిలోని బండి ముత్యాలమ్మ ఆలయం ఆదివారం యాత్రికులతో కిటకిటలాడింది. యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. మాజీమంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కార్య నిర్వహణ అధికారి దెందుకూరి రామకృష్ణంరాజు ఛైర్మన్ కొల్లాటి రామారావు, ఆలయ సిబ్బంది, పాలకవర్గ సభ్యులు యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేశారు. ప్రసాద్ వితరణ, తదితర సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

సొసైటీ ఛైర్మన్ రామభాస్కరరావును పరామర్శిస్తున్న మాజీ ఎంఎల్ఎ మాధవనాయుడు

భాస్కరరావుకు మాధవనాయుడు పరామర్శ

ప్రజాశక్తి - మొగల్తూరు

కొత్తోట గ్రామంలో మొగల్తూరు సొసైటీ ఛైర్ పర్సన్ మోటుపల్లి రామ భాస్కరరావును మాజీ ఎంఎల్ఎ బండారు మాధవ నాయుడు ఆదివారం పరామర్శించారు. ఇటీవల రామ భాస్కరరావు తల్లి ఆదమ్మ మరణించారు. వారి కుటుంబ సభ్యులను ఆయన కలిసి పరామర్శించారు. ఆయన వెంట మాజీ సర్పంచులు గట్టెం శ్రీను, పడవల గంగరాజు పలువురు నాయకులు ఉన్నారు.

నేటి నుంచి వాసవీ మాత ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి - పెనుగొండ

వాసవీ మాత ఆలయ నాలుగో వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 23 నుంచి 31వ తేదీ వరకూ ప్రత్యేక పూజా కార్యక్రమాల జరుగుతాయని ఆలయ అధ్యక్షులు ఎన్.గోవిందరాజులు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వాసవీ మాత దర్శనం కోసం వేలమంది ఇతర రాష్ట్రాల నుంచి వస్తారని తెలిపారు. ఈ సందర్భంగా పలు కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. అలాగే పీఠాధిపతులు, స్వామీజీలు, రాష్ట్ర నాయకులు వస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోట్ల వెంకటేశ్వరరావు, కోట్ల సూర్యారావు, కృష్ణ నందపూరి స్వామీజీ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

జన సైనికులు సమస్యలపై పోరాడాలి

ప్రజాశక్తి - మొగల్తూరు

జనసైనికులు నిరంతరం ప్రజలతో మమేకమై వారి సమస్యలపై పోరాడేందుకు సిద్ధంగా ఉండాలని జనసేన నరసాపురం నియోజకవర్గ ఇన్ఛార్జి బొమ్మిడి నాయకర్ సూచించారు. ఆదివారం రాత్రి పట్టణ అధ్యక్షుడు దూది బాబు నివాసంలో ఏర్పాటు చేసిన పట్టణ యూత్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సోమవారం నరసాపురం తెలగా కళ్యాణ మండపంలో నిర్వహించే నియోజకవర్గ సమావేశంలో అన్ని గ్రామాల నుంచీ జనసైనికులు, వీర మహిళలు, అభిమానులు, నాయకులు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పార్టీ అభివృద్ధికి, బలోపేతానికి తదితర వాటిపై చర్చించనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కొల్లాటి గోపి, పట్టణ యూత్ అధ్యక్షుడు బొక్కా చంటి, గజ్జరపు మురళీ, ముక్కు గిరి, మోకా శివ కుమారాజ్, నల్లం సురేష్ పాల్గొన్నారు.

మహారాజ శ్రీ నూజివీడు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

యస్.ఓ.పి.నెం. 228/2022

బిట్వీన్:
1) భూక్యా నాగమణి
2) భూక్యా గణేష్ కుమార్
3) భూక్యా విజయ్ కుమార్
...పిటీషనర్స్

మరియు

1) భూక్యా వెంకటేశ్వర్లు
2) లకావతు లక్ష్మి
3) సప్తగిరి గ్రామీణ బ్యాంక్ వినగడప బ్రాంచ్ తరపున బ్రాంచ్ మేనేజర్
...రెస్పాండెంట్స్

యిందుమూలముగా యావన్మందికి ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా.., పై పిటీషన్లోని 1వ పిటీషనరుకు భర్త మరియు 2, 3 పిటీషనర్సుకు తండ్రి గారైన భూక్యా శ్రీను అనే శ్రీనివాసరావు ది.15-12-2019వ తేదిన ఇంటస్టేట్గా మరణించియున్నారు. సదరు శ్రీనుకు రావలసిన ఇన్సూరెన్స్ సొమ్ము 3వ రెస్పాండెంట్ బ్యాంకులో సదరు భూక్యా శ్రీనివాసరావు గారి తల్లి గారైన భూక్యా కమలకు చెందిన ఎకౌంటులో జమకాబడియున్నవి. తదుపరి సదరు భూక్యా కమల గారు కొంత సొమ్ము విత్డ్రా చేసుకొనియున్నారు. దర్మిలా సదరు భూక్యా కమల ది.10-12-2020వ తేదిన మరణించియున్నారు. ప్రస్తుతం సదరు ఎకౌంటులో వున్న రూ.1,50,678/- లను మరియు దానిపై వచ్చు వడ్డీని సదరు భూక్యా శ్రీనివాసరావు ముఖ్య వారసులైన పిటీషనర్సుకు తీసుకొనుటకు గానూ, వారు సక్సెషన్ సర్టిఫికేట్ను కోర్టు ద్వారా పొంది, తద్వారా పైతెలిపిన సొమ్మును పొందుటకు గానూ పై తెలిపిన పిటీషనర్స్, పై నెంబరు సక్సెషన్ ఓ.పి. దాఖలు చేసుకొనియున్నారు. సదరు పై తెలిపిన పిటీషనర్స్, సదరు మరణించిన భూక్యా శ్రీనివాసరావు గారి యొక్క వారసులుగా శ్రీ కోర్టువారి వద్దనుండి సక్సెషన్ సర్టిఫికేట్ పొందుటలో ఎవరికైననూ ఏ విధమైన అభ్యంతరములు వున్న యెడల **ది.14-02-2023వ తేదీన ఉదయం 10:30 గంటలకు పై తెలిపిన శ్రీ కోర్టువారి ఎదుట ప్రత్యక్షముగా గానీ, మీ న్యాయవాది గారి ద్వారా గానీ హాజరయ్యి మీ ఆక్షేపణలు తెలుపుకొనగలరు.** లేనిచో పై తెలిపిన పిటీషనర్స్ సదరు మరణించిన శ్రీ భూక్యా శ్రీనివాసరావు గారి వారసులుగా భావించి, కోర్టువారు తగు ఉత్తర్వులను జారీ చేయగలరని తెలియచేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

మంకెన నరసింహారావు,
నూజివీడు, పిటీషనర్స్ తరపు న్యాయవాది,
22-1-23. నూజివీడు, ఏలూరు జిల్లా.